క్లుప్తంగా

మెప్మా అక్రమాలలో బాధ్యులపై చర్యలు

మెప్మా పీడీ వెంకటేశ్వరరావు



పొన్నూరు: పట్టణంలోని మెప్మా పరిధిలో అక్రమాలకు పాల్పడిన బాధ్యులపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు మెప్మా పీడీ వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిడుబ్రోలు పరిధిలో ఐదు గ్రూపులకు సంబంధించి పొదుపు సంఘాల సభ్యుల ప్రమేయం లేకుండా స్థానిక సిబ్బంది బ్యాంకుల ద్వారా అక్రమంగా రుణాలు స్వాహా చేశారని బాధితుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు గత రెండు రోజులుగా సభ్యులను, బ్యాంకు అధికారులను, స్థానిక మెప్మా సీఎంఎం జ్యోత్స్న, ఆర్‌పీ సంధ్య, సిబ్బందిని విచారించినట్లు తెలిపారు. విచారణలో సేకరించిన ఆధారాలను మెప్మా ఎండీ దృష్టికి తీసుకువెళ్లి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. మరికొన్ని బ్యాంకులలో బోగస్ గ్రూపులతో రుణాలు పొందినట్టు ఫిర్యాదులు ఉన్నాయని, వాటిపై కూడా విచారణ చేయనున్నట్లు పేర్కొన్నారు.

బ్యాక్టీరియా వలన కుష్టు వ్యాధి

ప్రత్తిపాడు కో లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్రవంతి




ప్రత్తిపాడు: మైక్రో బ్యాక్టీరియం లెప్రే అనే బ్యాక్టీరియా వలన కుష్టు వ్యాధి సంక్రమిస్తుందని ప్రత్తిపాడు కో లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్రవంతి అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా వారం రోజుల నుంచి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బుధవారం వైద్యాధికారి డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో స్థానిక సీహెచ్‌సీ నుంచి పాతమల్లాయపాలెం కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.
ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ చర్మంపై రాగి రంగు మచ్చలు, పొడలు ఉంటే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం ద్వారా అంగవైకల్యం బారిన పడకుండా కాపాడవచ్చని వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో స్వర్ణలత, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకుడికి డాక్టరేట్



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి, ఉపాధ్యాయుడి ఉన్నతికి తమ కళాశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎల్లప్రగడ నాగవెంకట సాయిరామ్‌కు తమిళనాడుకు చెందిన అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. ఎక్స్‌పెరిమెంటల్ ఇన్వెస్టిగేషన్ అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ లాస్టమ్ హెక్సా అల్యూమినేట్ రీయిన్ఫోర్స్‌డ్ ఏజెడ్91ఈ మెగ్నీషియం అల్లాయ్ కాంపోజిట్స్ అనే అంశంపై విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ జె.ప్రభాకరన్, ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలకు చెందిన డాక్టర్ సీతారకాంతల పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల కార్యదర్శి ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ టీపీపీ కృష్ణప్రసాద్‌లు అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



పెదకాకాని: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్లు పెదకాకాని పోలీసులు బుధవారం తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం కృష్ణాజిల్లా తాగుకుంట్ల గ్రామం, విసన్నపేట మండలానికి చెందిన కడియాల వెంకట కృష్ణారావు (58) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పెదకాకాని పీహెచ్‌సీ సమీపంలోని క్వారీలో మృతి చెంది ఉన్నాడు. అతని ఆధార్ కార్డు ప్రకారం మృతదేహాన్ని గుర్తించి బంధువులకు సమాచారం తెలిపినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

గుంతల రోడ్లతో ప్రజల అవస్థలు




గుంతలమయంగా ఉన్న పొన్నూరు వెళ్లే ప్రధాన రోడ్డు

- కసుకర్రు రోడ్డుకు మోక్షమెన్నడో
- సైడు కాలువల్లేక అధ్వానంగా మురుగు వ్యవస్థ

పొన్నూరు: మండలంలోని కసుకర్రు గ్రామ ప్రధాన రహదారితో పాటు వీధులు అభివృద్ధికి నోచుకోక అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లు కనీసం మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో గుంతలలో ప్రజలు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. కనీస వసతుల్ని కల్పించడంలో పంచాయతీ యంత్రాంగం నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. వర్షాలు కురిసిన సమయంలో రోడ్లపై నడిచేందుకు కూడా గ్రామస్తులు నరకయాతన పడుతున్నారు. ప్రధానంగా గ్రామ సెంటర్‌లో గుంతల సమస్య అధికంగా ఉంది. అసలే వర్షాకాలం కావడంతో ఆయా గుంతల్లో నీరు చేరుతోంది. నీటితో నిండిన కారణంగా ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు కిందపడి ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సైడు కాలువల నిర్మాణం మచ్చుకైనా కనిపించడం లేదు. ప్రధాన రహదారుల్లో సైతం కాలువలు లేకపోవడంతో మురుగు రోడ్లపై చేరుతుండటంతో అవస్థలు పడుతున్నారు. పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని.. అధికారులు స్పందించి రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టాలి



పొన్నూరుకు వచ్చే రోడ్డు గుంతలు పడటంతో రాకపోకలకు ఇబ్బందిగా తయారైంది. వర్షాలు కురిసిన సమయంలో రోడ్లపై నడవలేక పోతున్నాం. ప్రజలు పడే ఇబ్బందులను పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ప్రభుత్వం అధ్వాన్నంగా ఉన్న రోడ్లను అభివృద్ధి చేయాలి.

– వీర కుమార్, గ్రామస్తుడు

ముందుకు సాగని మురుగు



గ్రామంలో పూర్తిస్థాయిలో సైడు కాలువల నిర్మాణం లేదు. ఈ కారణంగా మురుగు నీరు రోడ్లపైకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు కూడా విజృంభిస్తున్నాయి. మురుగు వ్యవస్థ అధ్వానంగా ఉండటంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షాలు కురిసిన సమయంలో వాన నీటితో మురుగు కలిసి వీధులు చెరువులను తలపిస్తున్నాయి. సమస్యల పరిష్కారం పట్ల అధికారులు స్పందించాలి.

– సుబ్బారావు, గ్రామస్తుడు

అయ్యంకి, జాషువాకు ఘన నివాళి



వెంకట రమణయ్య, జాషువా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గేరా మోహనరావు

పెదకాకాని : గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతి వేడుకలను, గుర్రం జాషువా వర్ధంతి వేడుకలను బుధవారం గ్రంథాలయ అధికారి వేముల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పెదకాకాని ఎంపీపీ (ఎల్.ఇ.) పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెదకాకాని ఎంపీపీ (ఎల్.ఇ.) పాఠశాల హెచ్‌ఎం కొల్లిపర ఆనందరావు హాజరై అయ్యంకి వెంకట రమణయ్య, గుర్రం జాషువా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొల్లిపర ఆనందరావు మాట్లాడుతూ అయ్యంకి వెంకట రమణయ్య తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం తాలూకా కొంకుదురు గ్రామంలో జన్మించారని, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధ హస్తులని, పత్రికా సంపాదకుడుగా, గ్రంథాలయ సర్వస్వము అనే పత్రికను నిర్వహించారని అన్నారు. గ్రంథాలయ ఉద్యమంలో జీవితాంతం విశేష కృషి చేసి గ్రంథాలయ పితామహుడిగా పేరుగాంచారని, వీరి సేవలను గుర్తించిన ప్రభుత్వం 1972లో పద్మశ్రీతో గౌరవించిందని అన్నారు.
- గుర్రం జాషువా ఆధునిక తెలుగు కవుల్లో స్థానం పొందిన కవి గుర్రం జాషువా అని, కవిత్వాన్ని ఆయుధంగా చేసుకుని మూఢాచారాలపై తిరగబడ్డారని అన్నారు. కవిత విశారద, కవికోకిల, నవయుగ కవి చక్రవర్తి, మధుర శ్రీనాథ, విశ్వకవి సామ్రాట్‌గా ప్రసిద్ధుడయ్యారని వివరించారు. అనంతరం విద్యార్థులకు పద్యాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహుడు రమణయ్య

కాకుమాను: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య అని ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గేరా మోహనరావు అన్నారు. పెదనందిపాడు శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకి వెంకట రమణయ్య జయంతి వేడుకలను నిర్వహించారు. మోహనరావు మాట్లాడుతూ వెంకట రమణయ్య పత్రికా సంపాదకుడిగా పని చేస్తునే ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తులుగా నిలిచారని తెలిపారు. గ్రంథాలయ ఉద్యమంలో జీవితాంతం పాల్గొని గ్రంథాలయ పితామహుడిగా పేరు పొందారని అన్నారు. గ్రంథాలయం సర్వస్వం అనే పత్రికను స్థాపించి అనేక కథనాలను ప్రచురించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

'శిక్షా సప్తాహ్' పరిశీలన



ప్రత్తిపాడు హైస్కూల్‌లో శిక్షా సప్తాహ్ ఆటల పోటీలను పరిశీలిస్తున్న ఏపీసీ విజయలక్ష్మి



ఎలీఈ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఏపీసీ విజయలక్ష్మి

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: శిక్షా సప్తాహ్ కార్యక్రమాల షెడ్యూల్‌ను క్రమం తప్పకుండా ప్రతి పాఠశాలలోనూ అమలు చేయాల్సిందేనని సమగ్ర శిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి అన్నారు. ప్రత్తిపాడు మండలంలోని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు నామ మాత్రంగా జరుగుతున్నాయంటూ ఈ నెల 23వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన 'ప్రారంభమైన శిక్షా సప్తాహ్ వారోత్సవాలు' కథనంపై ఏపీసీ స్పందించారు. బుధవారం నియోజకవర్గ కేంద్రంలోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ఎలీఈ ప్రాథమిక పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేశారు. శిక్షా సప్తాహ్ షెడ్యూల్ ప్రకారం ఆయా పాఠశాలల్లో క్రీడా దినోత్సవం నిర్వహించి విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారా? లేదా? అన్న విషయాన్ని స్వయంగా పరిశీలించారు. షెడ్యూల్ అమలులో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, ఉన్నతాధికారుల ఆదేశాలు అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు.

మరుగుదొడ్లకు తాళాలా..?

తనిఖీల్లో భాగంగా ఎలీఈ పాఠశాలను పరిశీలించిన ఏపీసీ విజయలక్ష్మి మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉండటాన్ని గమనించారు. పారిశుద్ధ్య సిబ్బంది ఎక్కడని హెచ్‌ఎం సదాశివరావును ప్రశ్నించారు. పాఠశాల సమయంలో శానిటరీ వర్కర్ విధుల్లో లేకపోవడంతో ఆగ్రహానికి గురైన ఏపీసీ హెచ్‌ఎంతో పాటు ఎంఈవోకు మెమో ఇస్తున్నట్లు తెలిపారు. తొలుత విద్యార్థులు యూనిఫాం లేకుండా ఉండటంతో దుస్తులు ఇచ్చారా? లేదా అని ప్రశ్నించారు. ఇచ్చారని చెప్పడంతో మరలా బుధవారం పాఠశాలకు వస్తానని, ఆ రోజు అందరూ యూనిఫాంలో కనిపించాలని సూచించారు. వెంట అసిస్టెంట్ జీసీడీవో వి.సుజాత, ఎంఈవోలు సీహెచ్ రమాదేవి, లీలారాణి తదితరులున్నారు.

ఏ అంశంలోనూ జిల్లాలో వెనుకబడకూడదు

– మండల స్పెషల్ ఆఫీసర్ జి.విజయలక్ష్మి



ప్రత్తిపాడు: జిల్లాలో ఏ అంశంలోనూ మండలం వెనుకంజలో ఉండటానికి వీల్లేదని మండల ప్రత్యేకాధికారి జి.విజయలక్ష్మి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రగతి నివేదికలను సంబంధిత శాఖల అధికారులు స్పెషల్ ఆఫీసర్‌కు వివరించారు. ప్రత్యేకాధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ ఇకపై ప్రతి బుధవారం ఫీల్డ్ విజిట్‌లు ఉంటాయన్నారు. ఒక్కో వారం రెండు లేదా మూడు శాఖలకు సంబంధించిన అంశాలపై క్షేత్రస్థాయిలో గ్రామాలకు వెళ్లి పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. మనం ప్రభుత్వం నుంచి తీసుకునే ప్రతి రూపాయికీ సమాధానం చెప్పాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. జిల్లా ప్రగతిలో ఏ అంశంలోనూ వెనుకంజలో ఉండకూడదని, అన్ని శాఖలూ సమన్వయంతో ముందుకు వెళితేనే ఇది సాధ్యపడుతుందన్నారు. ప్రణాళికాబద్ధంగా పనులు చేస్తే సత్ఫలితాలు ఉంటాయని చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో దుర్గాప్రసాద్, తహసీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్ ప్రశాంతి, ఇన్‌చార్జి ఈవో పీఆర్డీ ఖాజా, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణల ఫిర్యాదులపై పరిశీలన



స్థలాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ ఖాజా

ప్రత్తిపాడు: ఆక్రమణలకు సంబంధించి అందిన ఫిర్యాదులను అధికారుల బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. మండల పరిధిలోని యనమదలలో పంట కాలువను కొందరు ఆక్రమించుకోవడంతో మురుగు ముందుకు పారడం లేదంటూ అదే గ్రామానికి చెందిన గన్నవరపు వీరబాబు, అదే విధంగా ఒకటవ వార్డులో ట్రాక్టర్లు పోవడానికి వీలులేకుండా పంచాయతీ బజారులో షెడ్డు లాంటి నిర్మాణాలు చేపట్టారని, దీని వలన మురుగునీరు, వర్షపు నీరు పోయేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ గ్రామస్తులు వై.సునీత, డి.నరేష్, జె.బాజిబాబు, పద్మారావు, డి.రమణలు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ ఖాజా సంబంధిత స్థలాలను రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణాలను తొలగించాలని సూచించారు.

సెల్ ఫోన్ దొంగల అరెస్టు

నెహ్రూ నగర్: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల నుంచి సెల్ ఫోన్లు దొంగిలించే ముఠాను ఆర్టీసీ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మేకల వెంకటేష్, పసుపులేటి ఏలియా రాజు ఉదయం బస్టాండ్‌లో ప్రయాణికుల వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు దొంగిలించి తిరిగి సాయంత్రం బస్టాండ్‌లో తిరుగుతున్న ఇద్దరిని ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ బి.మునిరెడ్డి, కానిస్టేబుల్ రాజశేఖర్ అదుపులోకి తీసుకొని బస్ స్టేషన్ ప్రాంగణంలోని అవుట్ పోస్ట్ పోలీసులకు అప్పగించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



కాకుమాను: సమాజంలో ప్రతి మహిళ సంగీతం పట్ల ఆసక్తి కలిగి ఉండాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త కారుమంచి ప్రసాద్ బాబు అన్నారు. కాకుమాను సమగ్రాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గత మే నెల నుంచి ప్రగతి మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పొందిన మహిళలకు స్థానిక చెన్నకేశవస్వామి దేవస్థాన కల్యాణ మండపంలో సంగీత పుస్తకాలను పంపిణీ చేశారు.
కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రసాద్ బాబు మాట్లాడుతూ నేటి మహిళలు కేవలం వంట గదికే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో ప్రగతి మహిళా మండలి ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. మండలి ఆధ్వర్యంలో మహిళలకు కుట్టులో శిక్షణ, జూట్ బ్యాగ్‌ల తయారీ వంటి అనేక రంగాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి కల్పిస్తుందని తెలిపారు. ప్రగతి మహిళా మండలి అధ్యక్షురాలు అరి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఆధార్ ప్రత్యేక శిబిరాలు



ఆధార్ ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ నయీం అహ్మద్

పొన్నూరు: ప్రస్తుతం ప్రతి ఒక్కరికీ ఆధార్ ఎంతో అవసరం. పాఠశాలలో చేరాలన్నా, ఉద్యోగంలో చేరాలన్నా, సంక్షేమ పథకాల లబ్ధి, సిమ్ కార్డు తీసుకోవాలన్నా, చివరకు లైసెన్సు పొందాలన్నా.. ఇలా ఏది కావాలన్నా ఆధార్ తప్పనిసరి. తరచూ ఆధార్ నవీకరణ, మార్పులకు సంబంధించి ప్రజలు మీ–సేవ కేంద్రాలు, సచివాలయాలు, బ్యాంకులు, పోస్టాఫీసు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలను ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 27 వరకు వార్డు సచివాలయాల్లోనే ఆధార్ నవీకరణకు ప్రత్యేక శిబిరాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. –పట్టణ పరిధిలో 17 సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్ తెలిపారు. మొబైల్ నంబరు, ఈ మెయిల్ ఐడీ లింకు, బయోమెట్రిక్ అప్‌డేట్, పేరు మార్పు, పుట్టిన తేదీ, జెండర్, చిరునామా మార్పు, ఆధార్ నమోదు వంటి సేవలు పొందాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. 25న గాజులపాలెంలోని 12, 14, టీచర్స్ కాలనీ 9, 10 సచివాలయాలు, 26న ఎస్టీ కాలనీ 15, 16, డీఆర్‌కే కాలనీలోని 8వ సచివాలయం, 27న జెండాచెట్టు 3, 4, క్యాబిన్‌పేటలోని 5వ సచివాలయంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయి.

క్రమశిక్షణతో కూడిన విద్యను వీవీఐటీ అందిస్తుంది

చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్



పెదకాకాని : ఆహ్లాదకర సమతుల్యత, క్రమశిక్షణతో కూడిన విద్యను వీవీఐటీ కళాశాల అందిస్తోందని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. బుధవారం కళాశాలలో డిప్లొమా విద్యను అభ్యసించి వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఇంజనీరింగ్ రెండవ సంవత్సరంలో ప్రవేశం పొందిన లేటరల్ ఎంట్రీ విద్యార్థుల తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో విద్యార్థుల భాగస్వామ్యం కీలకమని అన్నారు. నూతనంగా వీవీఐటీలో ప్రవేశించిన విద్యార్థులు మరింత మెరుగ్గా రాణించాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కళాశాలలోని సీమెన్స్ ఎక్సలెన్స్, ల్యాబ్ వంటి మౌలిక వసతులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం ద్వారా విద్యార్థులు ఉపాధి కల్పనకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఉదయ్ కుమార్, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, అడ్మిన్ డీన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శేకూరు జెడ్పీ హైస్కూల్ ఆకస్మిక తనిఖీ



శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో డీఈవో శైలజ

శేకూరు(చేబ్రోలు): చేబ్రోలు మండలం శేకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఆకస్మిక తనిఖీ చేశారు. శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు స్పోర్ట్స్ డే సందర్భంగా జరిగిన వివిధ క్రీడా పోటీలలో ఆమె పాల్గొని ఉపాధ్యాయులు, విద్యార్థులను ఉత్తేజ పరిచారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఈవో శైలజ సూచించారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ప్రతి రోజు తప్పనిసరిగా కొంత సేపు వ్యాయామం అవసరమని అన్నారు. తరగతి గదులలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు తగిన సూచనలు, సలహాలను అందజేశారు. మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మురుగు ముందుకు పారేలా చర్యలు

సాక్షి ఎఫెక్ట్



మురుగు కాలువలో పిచ్చిచెట్లు తొలగించిన అనంతరం ముందుకు పారుతున్న మురుగు

ప్రత్తిపాడు: మురుగు ముందుకు పారేలా పంచాయతీరాజ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న మురుగుకాలువలో పిచ్చిగడ్డి విపరీతంగా పెరిగి మైదానాన్ని, వనాన్ని తలపిస్తుందని, ఫలితంగా దోమల ఉధృతి ఎక్కువవుతోందంటూ ఈ నెల 23న 'నమ్మాలి మరి.. మురుగు కాలువే..!' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ ఖాజా మంగళ, బుధవారాల్లో పారిశుద్ధ్య కార్మికులతో గడ్డి, పిచ్చి చెట్లు పీకించి మురుగు ముందుకు పారేలా చర్యలు తీసుకున్నారు.

ప్రతి విద్యార్థికి ఉన్నత విద్యను అందించడమే లక్ష్యం



కంప్యూటర్ గదిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభిస్తున్న ప్రసాద్‌బాబు

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి అన్ని వసతులు కల్పించి వారికి నాణ్యమైన విద్యను అందించడంలో తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడు అందిస్తానని ప్రముఖ పారిశ్రామిక వేత్త కారుమంచి ప్రసాద్ బాబు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బుధవారం తన తల్లి కారుమంచి నాగరత్నమ్మ జ్ఞాపకార్థం 5 కంప్యూటర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని అన్నారు. పాఠశాల హెచ్‌ఎం సత్యం మాట్లాడుతూ సొంత ఖర్చుతో గత 5 సంవత్సరాల నుంచి ప్రతి రోజు పాఠశాల అనంతరం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాతలు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరాలని అన్నారు. దాత ప్రసాద్ బాబు కంప్యూటర్ తరగతి గదులను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఇస్రో శాస్త్రవేత్త నూతి సత్యన్నారాయణ, మండల ప్రత్యేకాధికారిణి తేళ్ల ప్రేమకుమారి, మామిళ్లపల్లి రాంగోపాల్, నల్లమోతు పూర్ణచంద్రరావు, ఎంఈవోలు కేఎఫ్ కెనడీ, విజయ్ భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి



చేబ్రోలు: పాఠశాల విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు కోరారు. చేబ్రోలులోని ఎంపీడీవో కె.జ్యోతికి బుధవారం యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ దశల వారి కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు, జీవో 117 రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని యూటీఎఫ్ నాయకులు అందజేశారు. పాఠశాలల విలీనాన్ని రద్దు చేయాలని, సమాంతర మీడియంలను కొనసాగించాలని, హైస్కూల్స్‌లో నాన్ టీచింగ్ స్టాఫ్‌ని నియమించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రమేష్ బాబు, డి.నాగేశ్వరరావు, ఐ.శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, విజయ రాజు, రమణారావు పాల్గొన్నారు.